సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం, 7, జూన్, 2025



కోయిల్‌సాగర్‌కు కృష్ణమ్మ

జూరాల నుంచి నీటిని వదలడంతో కృష్ణాజలాలు కోయిల్‌సాగర్‌కు పరుగులు పెడుతున్నాయి.

వివరాలు 10లో ▸



అనన్య ప్రతిభ

ఉమ్మడి జిల్లాకు చెందిన అనన్యశ్రీ వాలీబాల్ క్రీడలో అసమాన్య ప్రతిభ కనబరుస్తోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 39.2/21.8

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

భూ సేకరణ ప్రక్రియ వేగిరం చేయాలి : కలెక్టర్



నాగర్‌కర్నూల్: జిల్లాలో కొనసాగుతున్న కేఎల్ఐ, పాలమూరు– రంగారెడ్డి, మార్కండేయ, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి 14 ప్యాకేజీల పరిధిలో 11,930.22 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 11,899.07 పూర్తయ్యిందని, మిగిలిన 31.15 ఎకరాలు వెంటనే చేపట్టాలన్నారు. అలాగే కేఎల్ఐ పరిధిలోని 28వ ప్యాకేజీకి సంబంధించి 27 ఎకరాలు, 29వ ప్యాకేజీలో 242 ఎకరాలు, 30వ ప్యాకేజీలో 256 ఎకరాలు, మార్కండేయ ఎత్తిపోతలకు సంబంధించి 104.42 ఎకరాలు ఉందని, దీనిని ఈ నెలాఖరు వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలో 244.15 ఎకరాలు, కర్నెతండా ప్రాజెక్టుకు సంబంధించి 3.28 ఎకరాల భూమిని త్వరగా సేకరించాలన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు శ్రీధర్, పార్థసారథి, మురళి, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి నాగేందర్, ఆర్డీఓలు శ్రీను, మాధవి, సురేష్, భూ సేకరణ విభాగం కలెక్టరేట్ సూపరింటెండెంట్ నారాయణ, కార్తీక్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ మాట్లాడుతూ పండుగను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో డ్రగ్స్, గంజాయికి సంబంధించి వీడియో సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాల మండలం అప్పాయపల్లి గ్రామవాసి, రైటర్ వేముల శివరాంసాగర్, ప్రొడ్యూసర్ మహేష్ గంజాయి, మాదక ద్రవ్యాలపై వీడియో సాంగ్ చేయడంతో ఎంతో మందికి అవగాహన కలుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగుతోపాటు విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు (సెల్ నం.87126 57709) సమాచారం అందించాలన్నారు. ఏఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ విద్యార్థులకు చివరి అవకాశం

కల్వకుర్తి టౌన్: పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో 2010– 2016 మధ్యకాలంలో డిగ్రీ ఏదైనా సబ్జెక్టులో ఫెయిలైన వారు జూలైలో జరిగే పరీక్షలలో రాసే విధంగా అవకాశం యూనివర్సిటీ కల్పించిందని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శార్వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే వారంతా ఫీజుకు అదనంగా ప్రతి సబ్జెక్టుకు రూ.3 వేలు ఈ నెల 16లోగా చదువుకున్న కళాశాలలో చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షల కోఆర్డినేటర్ రాజును కలిసి తెలుసుకోవాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కందనూలు: జిల్లాకేంద్రం నుంచి అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 8 గంటలకు నాగర్‌కర్నూల్ బస్టాండ్ నుంచి బయలుదేరి మంగళవారం రాత్రి అరుణాచలానికి చేరుకుంటుంది. మళ్లీ బుధవారం సాయంత్రం 5 గంటలకు అరుణాచలంలో బయలుదేరి గురువారం ఉదయం నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటుందని, ఈ అవకాశాన్ని అరుణాచలం వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అప్రమత్తతే కీలకం..

- లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే విత్తనాలు తీసుకోవాలి
- రసీదులో లాట్ నంబర్ నమోదు తప్పనిసరి
- అదునులో నాటుకుంటేనే ప్రయోజనం
- నీటి వసతి లేకుంటే తొందరపడవద్దు
- జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



సాక్షి, నాగర్‌కర్నూల్: రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని, లైసెన్స్‌డ్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. విత్తనాలు కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, అందులో సంబంధిత విత్తన లాట్ నంబర్ నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించాలని కోరారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఓపిగ్గా సమాధానాలు ఇచ్చారు. విత్తనాల ఎంపిక, పంటల సాగులో మెళకువలు, నాసిరకం విత్తనాల కట్టడికి తీసుకుంటున్న చర్యలను రైతులకు వివరించారు.

ప్రశ్న : గత సీజన్‌లో నాసిరకం పత్తి విత్తనాలు కొని తీవ్రంగా నష్టపోయాం. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. మాకు నష్టపరిహారం అందలేదు.

– జంగయ్య, వెల్గొండ, బిజినేపల్లి మండలం

డీఏఓ : జిల్లాలోని ప్రభుత్వ ఆధీకృత లైసెన్స్‌డ్ విత్తన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో లూస్ సేల్స్, విడి, నమ్మకం లేని విత్తనాలను కొనవద్దు. లైసెన్స్‌డ్ దుకాణాల్లో విత్తనాలు తీసుకున్నా తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. అందులో విత్తన లాట్ నంబర్ నమోదు చేయించుకోవాలి. అలా అయితేనే డీలర్, విత్తన కంపెనీలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రశ్న: కూరగాయల సాగుకు ఎలాంటి పరిస్థితులు అనుకూలం. వానాకాలం సీజన్‌లో ఎలాంటి సన్నరకాలు సాగు చేయాలి.?

– లింగస్వామి, పెద్దకొత్తపల్లి, జోగయ్య, వెల్దండ

ప్రశ్న : ప్రభుత్వం తరఫున రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేపడితే ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాలో పచ్చిరొట్ట విత్తనాల కొరత ఉంది.

– శివకుమార్, కల్వకుర్తి

డీఏఓ : జిల్లాలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతుల కోసం భూసార పరీక్షల కేంద్రం ఏర్పాటైంది. ఔత్సాహిక రైతులు మట్టి నమూనాలను తీసుకెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. జిల్లాలో పచ్చిరొట్ట విత్తనాలతో పాటు ఇతర విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

డీఏఓ : కేవలం వర్షాధారంపై ఆధారపడి కూరగాయల సాగు చేయవద్దు. కచ్చితంగా నీటి వసతి ఉంటేనే ముందుకెళ్లాలి. మేలైన విత్తనాలు లేదా నర్సరీల్లో నార్లు దొరుకుతున్నాయి. ముందుగా తక్కువ మొత్తంలో కూరగాయలు సాగుచేసి, మార్కెట్ పరిస్థితులను బట్టి సాగు విస్తీర్ణం పెంచుకోవాలి. సన్నరకం వరి ధాన్యం విత్తనాలలో కూనారం సన్నాలు 1638 రకం మంచి దిగుబడి ఇస్తున్నాయి.

ప్రశ్న: పత్తి సాగులో నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు వాడితే తెగుళ్లు ఎక్కువగా వస్తాయా..?

– గోపాసు లక్ష్మణ్, గోరటి కాశన్న, కార్వంగ, తెలకపల్లి మండలం

డీఏఓ : పత్తి పంటకు మొదటి దశలో స్ప్రింక్లర్లు వాడితే ఎలాంటి నష్టాలు ఉండవు. పూత వచ్చే వరకు స్ప్రింక్లర్లు వాడుకోవచ్చు. పత్తి, వేరుశనగ వంటి పంటలు ఆలస్యంగా విత్తుకుంటే చివరి దశలో తెగుళ్లు, చీడపీడలు ఆశించే అవకాశం ఉంటుంది. అదును జూన్ 15లోపు పత్తి విత్తుకోవాలి. మొక్కల వేరు వ్యవస్థ బలోపేతం అయ్యేందుకు ప్రారంభంలోనే ఎరువులు వేసుకోవాలి. సింగిల్ సూపర్ పాస్ఫేట్ గుళికలను ఎకరాకు 4 సంచుల చొప్పున చల్లుకోవాలి.

ప్రశ్న: గతంలో రైతు చైతన్య యాత్రల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందేవి. మార్కెటింగ్, సహకార, వ్యవసాయ, విద్యుత్ అధికారుల సమన్వయంతో మీటింగ్‌లు జరిగేవి. ఇప్పుడు అలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు.

– పురుషోత్తంరెడ్డి, వెల్దండ, దేశ్యనాయక్, అచ్చంపేట

డీఏఓ : ప్రస్తుతం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా నిరంతరం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యామ్నాయంగా మినుము, పెసర తదితర పంటల సాగు గురించి వివరిస్తున్నాం. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్‌లో భాగంగా ప్రతి మంగళవారం రైతువేదికల్లో 2 గంటల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందిస్తున్నాం.

ప్రశ్న: నకిలీ, నాసిరకం విత్తనాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎంత మందిపై చర్యలు తీసుకున్నారు. విత్తనాల డీలర్ల పేరుతో బినామీలు అమ్మకుండా చూడాలి.

– వావిలాల రాజశేఖరశర్మ, నాగర్‌కర్నూల్, బాలాజీ, అచ్చంపేట

డీఏఓ : నకిలీ విత్తనాల సరఫరాపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతున్నాం. ఇటీవల తిమ్మాజిపేటలో ఒకరిని గుర్తించాం. పోలీసులు కేసు నమోదు చేసి, ఎక్కడి నుంచి వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. లైసెన్స్‌డ్ డీలర్ల స్థానంలో ఇతర వ్యక్తులు విక్రయాలు జరపకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వం సర్టిఫై చేసినవారే అమ్మకాలు జరిపేలా చూస్తున్నాం.

ప్రశ్న : మా దగ్గర విత్తనాలు తీసుకుంటే రసీదు ఇవ్వడం లేదు. అడిగితే తెల్ల పేపర్‌పై రాసి ఇస్తున్నారు. రసీదు ఇవ్వడం అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. విత్తనాలకు ఏమైనా సబ్సిడీ ఇస్తున్నారా..?

– ప్రదీప్, వెల్దండ

డీఏఓ : విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా లైసెన్స్‌డ్ డీలర్లు రసీదులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఉద్యానవన పంటలకు మాత్రమే డ్రిప్ సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు అదనంగా తూకంతోపాటు హమాలీ చార్జీలు రైతుల నుంచే వసూలు చేస్తున్నారు.

– శ్రీనునాయక్, దేవదారికుంట, ఉప్పునుంతల మండలం

డీఏఓ: కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎఫ్ఏక్యూ నిబంధనల మేరకు ధాన్యాన్ని ఎలాంటి తప్ప, తాలు లేకుండా తీసుకురావాలి. కానీ, చాలా వరకు రైతులు ధాన్యాన్ని ప్యాడీ క్లీనింగ్ చేయడం లేదు. రైతులు నిబంధనల మేరకు ధాన్యం తెచ్చి నష్టపోకుండా చూసుకోవాలి. జిల్లాలో పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ కొనసాగుతోంది.

మూడేళ్లలో 'పాలమూరు' పూర్తి



నవాబుపేటలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీలకు రూ.102 కోట్లు విడుదల
- తెలంగాణ రైజింగ్‌ను ఆపలేరు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

అడ్డాకుల/నవాబుపేట: 'కుట్రదారులు ఎన్ని కుతంత్రాలు పన్నినా.. తెలంగాణ రైజింగ్‌ను ఆపలేరని.. తెలంగాణ వెలుగుతోంది.. మనకు ఇక ప్రపంచంతోనే పోటీ' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రజల అవసరాలు, ఆకాంక్షలే ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. 'పాలమూరు– రంగారెడ్డి' ఎత్తిపోతలను మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. శుక్రవారం నవాబ్‌పేట, మూసాపేటలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్‌ను బట్టి 2033– 35 సంవత్సరానికి ప్రణాళిక వేసుకుని 33,700 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంపద సృష్టించి.. పారిశ్రామిక రంగంలో తెలంగాణను అభివృద్ధి చేసేందుకు విద్యుత్ పరంగా అన్ని ఏర్పాట్లు చేసి భవిష్యత్‌లో తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడేలా వివిధ దేశాల కంపెనీలు మన ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు.

బీజేపీ తెలంగాణ ఇవ్వలేదు

కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు దేశంలో 3 కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసినా చంద్రబాబునాయుడు వద్దన్నందుకే బీజేపీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం వస్తుందని తెలిసినా నాడు సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలన గత బీఆర్ఎస్ పాలన మాదిరిగా సాగితే రాష్ట్రాన్ని అమ్ముకునే పరిస్థితి వచ్చేదన్నారు. అందుకే బీఆర్ఎస్‌ను దగ్గరికి రాకుండా దూరం పెట్టాలని ప్రజలను కోరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ స్వర్ణమ్మ, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ చైర్మన్లు ప్రశాంత్, కథలప్ప పాల్గొన్నారు.

సస్యశ్యామలం చేస్తాం

నిధులు ఆవిరైనా.. నీళ్లు రాలేదని... కాంగ్రెస్ ప్రభుత్వమే పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా జలాలతో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తుందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరును సస్యశ్యామలం చేస్తారని, అందుకు కేబినెట్ కూడా పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.70 కోట్లు, శంకరసముద్రం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం రూ.32 కోట్లను విడుదల చేస్తామన్నారు. అలాగే చౌదర్‌పల్లి లిఫ్ట్‌కు సాధ్యమైనంత త్వరగా ఆర్థికపరమైన అనుమతులిస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో దొంగలు పడ్డట్లు దోపిడీ చేశారని విమర్శించారు. లేనిది ఉన్నట్లు.. ఉన్నది లేనట్లు చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కల్వకుర్తి: పట్టణంలోని బాలికల గిరిజన గురుకుల కళాశాల సీఈసీ గ్రూప్‌లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ పార్వతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పాసైన ఉమ్మడి జిల్లా ఎస్టీ కులానికి చెందిన విద్యార్థులు నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 11న నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లకు వచ్చే విద్యార్థులు వారి వెంట ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని, 10వ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నం.94909 57316ను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

- మహబూబ్‌నగర్ నుంచి పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలకు ప్రత్యేక బస్సులు
- ఈ నెల 27వ తేదీన ప్రారంభం: ఆర్ఎం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలకు వెళ్లే వారికి ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆర్ఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పది డిపోల నుంచి ఈ బస్సు (సూపర్ లగ్జరీ, డీలక్స్)లను అవసరమైన చోటకు పంపడానికి సిద్ధంగా ఉంచుతామన్నారు. ఏడు రూట్లలో ఆయా ప్యాకేజీలను బట్టి చార్జీలు వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఒకవేళ బస్సులో సామూహికంగా ఏదైనా సంస్థ (పాఠశాలలు, కళాశాలలు) లేదా ఇతర సంఘాల తరఫున ఒకేసారి 30 నుంచి 35 మంది వరకు వెళ్లొచ్చేందుకు బుక్ చేసిన వారి పేర ఒకరికి ఉచిత సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే అందరికీ కలిపి పది శాతం రిబేటు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ (ఫోన్ నం .99592 26286)ను సంప్రదించవచ్చన్నారు. దీనికి సంబంధించి ఈనెల 27న రాష్ట్రస్థాయిలో రోడ్లు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారన్నారు. అంతకంటే ముందే ఎవరైనా ఈ ప్యాకేజీలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఈ ప్యాకేజీకి చెందిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీధర్మ, డీఎం బి.సుజాత, పీఓ వి.సుజాత, ఏఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్యాకేజీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎం సంతోష్‌కుమార్, తదితరులు

మహబూబ్‌నగర్ డిపో ప్యాకేజీ ఇలా..

రూట్	పర్యాటక ప్రాంతాలు	ప్యాకేజీ	ఒక్కొక్కరికి చార్జి
రూట్-1	కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం	3 రోజులు	రూ.3,600
రూట్-2	గనుగాపూర్ తుల్జాపూర్, పండరీపూర్	2 రోజులు	రూ.2,450
రూట్-3	మహానంది, యాగంటి, బ్రహ్మంగారిమఠం, మంత్రాలయం	2 రోజులు	రూ.2,100
రూట్-4	తుల్జాపూర్, శనిసింగనాపూర్, షిరిడీ	3 రోజులు	రూ.3,600
రూట్-5	యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, నాగిరెడ్డిపల్లి (స్వర్ణ శివాలయం)	ఒక రోజు	రూ.1,050
రూట్-6	అలంపూర్, బీచుపల్లి, శ్రీరంగాపూర్, జటప్రోలు, సోమశిల, సింగోటం	ఒక రోజు	రూ.950
రూట్-7	విశాఖపట్టణం, అరకు, బుర్రగుహలు, సింహాచలం, అన్నవరం, ద్వారక తిరుమల, విజయవాడ	5 రోజులు	రూ.4,400


గమనిక: రీజియన్ పరిధిలోని మిగతా తొమ్మిది ఆర్టీసీ డిపోల నుంచి సైతం దూరాన్ని బట్టి ఈ ప్యాకేజీల కింద చార్జీలలో మార్పులు ఉంటాయి.

● నడిగడ్డలో 'హస్త'వ్యస్తం

నువ్వా.. నేనా!

కాంగ్రెస్‌లో నేతల మధ్య తారస్థాయికి ఆధిపత్య 'పోరు'

- ఇప్పటికే గద్వాలలో సరిత, ఎమ్మెల్యే బండ్ల మధ్య వైరం
- తాజాగా తెరపైకి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి ఎపిసోడ్..
- సరిత ఇంట్లో తేనేటి విందుకు హాజరుకావడంపై దుమారం
- ఎంపీ మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ వర్గీయుల మండిపాటు
- పలువురికి షోకాజ్ నోటీసులు.. ప్రతిగా ఎంపీపై అధిష్టానానికి ఫిర్యాదు
- పోటాపోటీ పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నువ్వా.. నేనా అన్నట్లు నేతల మధ్య ఆధిపత్య పోరుతో జోగులాంబ గద్వాల జిల్లాలో అధికార పార్టీ కాంగ్రెస్ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత మధ్య వైరం ఇదివరకే పార్టీ అధిష్టానానికి సంకటంగా మారగా.. ఇటీవల అలంపూర్ సెగ్మెంట్‌కు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడి ఎపిసోడ్ మరిన్ని తలనొప్పులు తెచ్చిపెట్టింది. సరిత ఇంట్లో తేనీటి విందుకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి.. విజయుడిని వెంటబెట్టుకుని వెళ్లడంతో వివాదం తలెత్తింది. దీంతో మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మధ్య ఉన్న వైషమ్యాలు వీధికెక్కాయి. ఈ క్రమంలో పలువురు యువజన నాయకులకు షోకాజ్ నోటీసుల జారీ.. ప్రతిగా ఎంపీ వైఖరిపై సంపత్ అధిష్టానానికి ఫిర్యాదు చేయడం వంటి పోటాపోటీ పరిణామాలు కాంగ్రెస్‌ను కుదిపేస్తున్నాయి.

తెరదించే ప్రయత్నం.. అంతలోనే..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు ఎపిసోడ్ కాంగ్రెస్‌లో కలకలం సృష్టించగా.. వివాదంపై ఎంపీ మల్లురవి స్పందించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాధృచ్ఛికంగా సరిత ఇంట్లో తేనేటి విందుకు విజయుడితో కలిసి హాజరయ్యామని.. మా మధ్య రాజకీయ పరమైన చర్చలు జరగలేదని వీడియోను పోస్టు చేశారు, సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం కల్పితాలేనంటూ కొట్టిపారేశారు. తాను డబ్బులు తీసుకున్నానని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానని చెప్పారు. ఎంపీ స్పందనతో వివాదం సద్దుమణిగిందని భావిస్తున్న తరుణంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వర్గీయులైన యువజన కాంగ్రెస్ నాయకులు కోల నర్సింహ, వరకుంట్ల గణేష్, కేఎంఆర్ యేసు, కాశపోగు శేఖర్ తదితరులకు షోకాజ్ నోటీసులు జారీ కావడం మళ్లీ మలుపు తిరిగినట్లయింది. ప్రతిగా సంపత్ తన వర్గీయులతో కలిసి మల్లు రవితో పాటు సరితపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు పలువురు నాయకులు సంతకాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను ఇప్పించి.. వారి నుంచి 10–20 శాతం కమీషన్ వసూలు చేసినట్లు ఎంపీపై ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ పార్టీని అభాసుపాలు చేస్తున్నారని.. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరడం మరింత సెగ రాజేసినట్లు తెలుస్తోంది.ఈ పరిణామాలతో గద్వాల జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

గద్వాల

సరిత వర్సెస్ బండ్ల

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనంతరం సుమారు ఆరు నెలల వరకు గద్వాల జిల్లా కాంగ్రెస్‌లో పెద్దగా లుకలుకలు లేవు. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో వర్గ పోరు మళ్లీ తీవ్రమైంది. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల బీఆర్ఎస్‌లో ఉన్నంతకాలం ఇరువురి మధ్య ఆధిపత్య పోరు నడిచింది. 2023 ఎన్నికల ముందు సరిత కాంగ్రెస్‌లో చేరి.. ఎమ్మెల్యేగా పోటీ చేసిన విషయం తెలిసిందే. బండ్ల చేతిలో ఓటమి పాలైనప్పటికీ.. నియోజకవర్గంలో ఆమెదే పైచేయిగా నిలిచింది. ఎప్పుడైతే ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని మంత్రి జూపల్లి కాంగ్రెస్‌లో చేర్పించారో.. అప్పటి నుంచి వర్గ పోరు మళ్లీ మొదలైంది. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారంటూ సరిత వర్గీయులు నినాదాలు చేయడం, ప్రతిగా బండ్ల వర్గం వాదనకు దిగడం రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు మంత్రి జూపల్లి.. సరితకు ఎంపీ మల్లురవి అండదండలు ఉన్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

అలంపూర్ తేనేటి విందుతో ప్రకంపనలు



ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మధ్య కొన్నాళ్లుగా అంతర్గత వైరం కొనసాగుతున్నట్లు సమాచారం. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్లురవి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడితో కలిసి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఇంట్లో తేనేటి విందులో పాల్గొనడం కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టించింది. దీంతో నేతల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. సంపత్‌కుమార్ వర్గీయులు మల్లు రవికి వ్యతిరేకంగా గళం వినిపించారు. అలంపూర్‌లో సంపత్ అన్నీ తానై ఎంపీగా మల్లు రవిని గెలిపించాడని.. ఆయనేమో సంపత్‌ను రాజకీయంగా దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లోకి రప్పించే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ అయి ఉండి క్రమశిక్షణ తప్పారని.. వివిధ ప్రభుత్వ, ఇతర పనుల్లో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని ఆరోపించడం పార్టీలో కాక రేపింది.

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి


సాలమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: పాముకాటుకు గురై మహిళ మృతిచెందిన ఘటన పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సాతాపూర్‌కు చెందిన బద్దుల సాలమ్మ (40) శుక్రవారం తెల్లవారు జామున ఇంటి వాకిలిని ఊడుస్తున్న క్రమంలో పాముకాటుకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలికి భర్త చిన్నయ్య, ఇద్దరు కూతుళ్లు శిరీష, కృష్ణవేణి ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

ధన్వాడ: మండలంలోని చర్లపల్లికి చెందిన కరుణాకర్‌రెడ్డి (41) శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. పొలం వద్ద బోరుమోటార్ కేబుల్ వైరు తెగడంతో తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య వనజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొండేరులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొండేరుకు చెందిన వడ్డె లక్ష్మన్న (32) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగించే వాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన అతడు.. ఇంట్లో తరచుగా గొడవ పడుతుండటంతో ఇటీవల తన భార్య శివమ్మ పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మన్న.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వంటగ్యాస్ లీకై ఐదుగురికి గాయాలు

గట్టు: మండలంలోని ఆలూరులో వంటగ్యాస్ లీకై ఐదుగురు గాయపడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. ఆలూరుకు చెందిన పూలకుంట నర్సింహులు అలియాస్ దుబ్బన్న ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఖాళీ కావడంతో బుధవారం మరో సిలిండర్‌ను అమర్చేందుకు ఇంటి పక్కనున్న వెంకటేశ్ పిలిచారు. గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను అమర్చుతున్న క్రమంలో గ్యాస్ లీక్ కావడంతో పక్కనే ఉన్న కట్టెల పొయ్యిలోని మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో ఇంట్లోనే ఉన్న వెంకటేశ్‌తో పాటు దుబ్బన్న, అతడి భార్య జయమ్మ, కోడలు మహేశ్వరి, మూడేళ్ల బాలుడు అభికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

జూరాలకు 7,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దరూరు/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో మరింత తగ్గు ముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం7,800క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. వరద ప్రవాహం తగ్గడంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తిని నిలిపివేశారు.నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,532 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.319 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 27.402 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

తుమ్మిళ్ల రీచ్‌ల వద్ద విజిలెన్స్ అధికారులు?

అలంపూర్: రాజోళి మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో టీఎస్ ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. కాగా గత కొన్ని నెలల నుంచి ఆ అనుమతుల ద్వారా చేసిన ఇసుక డంపులు అలాగే ఉన్నాయి. తాజాగా వాటిని కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు తెలిసింది. ఈ క్రమంలో రాష్ట్ర విజిలెన్స్ అధికారులు శుక్రవారం తుమ్మిళ్లలో పర్యటించి ఇసుక రీచులను పరిశీలించినట్లు సమాచారం. అయితే విజిలెన్స్ అధికారులు వచ్చినట్లు మండల అధికారులు కూడా సమాచారం ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే మండల అధికారులకు తెలియదా..? లేక కావాలనే విషయాన్ని గోప్యంగా ఉంచారా అనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే స్థానికంగా వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు గ్రామంలో పర్యటించినట్లు తెలిసింది.

అనన్య.. ప్రతిభ

వాలీబాల్ క్రీడలో రాణిస్తున్న పాలమూరు బిడ్డ
- ఆసియా వాలీబాల్ టోర్నీకి ఎంపిక
- వియత్నాంలో నేటి నుంచి 14వ తేదీ వరకు పోటీలు
- రెండోసారి అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం


ఆసియా వాలీబాల్ టోర్నీలో అనన్యశ్రీ (బ్లూ జెర్సీ)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. తల్లిదండ్రులు పి.ఆనంద్, వరలక్ష్మి ప్రోత్సాహంతో వాలీబాల్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. 2018లో అప్పటి జిల్లా యువజన, క్రీడల అధికారిణి సత్యవాణి ఆధ్వర్యంలో పొడగారి బాలికల క్రీడా నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. 180 సెం.మీ. ఎత్తు ఉన్న అనన్యశ్రీ వాలీబాల్ క్రీడకు ఎంపికయ్యారు. అనంతరం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ అకాడమీ ప్రవేశ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచారు. అక్కడ వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి.. 2019లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా అథ్లెట్ పథకం కింద కేరళలోని పట్టణమిట్టలో గల వాలీబాల్ అకాడమీకి అనన్యశ్రీ ఎంపికై 2024 ఆగస్టు వరకు శిక్షణ తీసుకున్నారు. గతేడాది క్రీడా కోటా కింద పూణెలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉద్యోగం సాధించారు.

మూడు సార్లు తెలంగాణకు ప్రాతినిధ్యం..

2018 పంజాబ్ (చండీగఢ్)లో జరిగిన జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమీ తరఫున అనన్యశ్రీ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. 2019 తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 కడపలో జరిగిన జూనియర్ నేషనల్, మరో జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

పలుసార్లు కేరళ జట్టుకు..

అనన్యశ్రీ రెండుసార్లు కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. దేశంలోనే క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే కేరళ రాష్ట్రంలో పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ.. తన ప్రతిభతో ఆ రాష్ట్ర జట్టుకు ఎంపికై సంచలనం సృష్టించారు. 2022లో కేరళ రాష్ట్రం తరఫున ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్‌లో జరిగిన 23వ జాతీయస్థాయి, మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో జరిగిన 24వ జాతీయ యూత్ వాలీబాల్ పోటీల్లో ఆమె పాల్గొన్నారు. కేరళలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, 2023లో అస్సాం రాష్ట్రం గౌహతిలో జరిగిన 71వ ఉమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు అనన్యశ్రీ ప్రాతినిధ్యం వహించారు. సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ మహిళా జట్టు విజేతగా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకం సాధించారు. పాండిచ్చేరిలో జరిగిన ఫెడరేషన్ కప్ వాలీబాల్ పోటీల్లో అనన్యశ్రీ పాల్గొనగా.. కేరళ రాష్ట్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది.

ఏషియన్ గేమ్స్‌లో ఆడాలన్నదే లక్ష్యం..

రెండోసారి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నా. 2023లో చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నాను. వియత్నాంలో జరిగే ఆసియా వాలీబాల్ టోర్నీలో పాల్గొనే భారత మహిళా జట్టుకు ఎంపికై నందుకు చాలా సంతోషంగా ఉంది. ఏషియన్ గేమ్స్‌లో ఆడాలన్నదే లక్ష్యం. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా. – అనన్యశ్రీ, మక్తల్



ఆసియా వాలీబాల్ పోటీలకు ఎంపిక..

అనన్యశ్రీ రెండోసారి విదేశీ గడ్డపై వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. చైనా దేశం చెంగ్డు నగరంలో 2023 ఆగస్టులో జరిగిన 'వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్'లో కేరళ యూనివర్సిటీ జట్టు తరఫున పాల్గొన్న ఆమె.. ప్రస్తుతం మరోసారి అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో జరిగిన ఇండియన్ వుమన్ జట్టు శిక్షణ క్యాంపులో అనన్యశ్రీ పాల్గొని వియాత్నంలో ఈనెల 7 నుంచి 14 వరకు వియత్నాంలోని హనోయిలో జరిగే ఆసియా వాలీబాల్ టోర్నీలో భారత జట్టుకు ఎంపికైంది.

ఈద్ ముబారక్..

నేడు ఈద్–ఉల్–అజ్‌హా


జిల్లా ఆస్పత్రి సమీపంలో పొట్టేళ్ల విక్రయాలు

- ఈద్గాలు, మసీదుల్లో నమాజ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు
- ఖుర్బానీ కోసం పొట్టేళ్ల కొనుగోళ్లు
- కిటకిటలాడుతున్న మార్కెట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లావ్యాప్తంగా శనివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకొనేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం చివరి మాసమైన జిల్‌హిజ్జా 10వ తేదీన జరుపుకొనే ఈ పండుగను 'ఈద్-ఉల్-అజ్‌హా'గా వ్యవహరిస్తారు. సామూహికంగా ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేయడం రివాజు. సర్వమానవ కల్యాణం కోసం నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ నూతన వస్త్రాలు ధరించి.. ఆనందోత్సాహాలతో పండుగ నిర్వహించుకోనున్నారు. ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు రియాజుల్ జన్నా మసీదు నుంచి ముస్లింలు ఊరేగింపుగా జామియా మసీదు, గడియారం చౌరస్తా మీదుగా స్థానిక రహెమానియా ఈద్గా వద్దకు చేరుకొని 9 గంటలకు ప్రత్యేక ఈద్ నమాజ్ చేస్తారు. అదే విధంగా పట్టణంలోని పలు మసీదుల్లో కూడా బక్రీద్ ప్రత్యేక ఈద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు.

ఖౌమి ఏకతా కమిటీ ఆధ్వర్యంలో వేదిక..

బక్రీద్ సందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు చెప్పడానికి ఈద్గా ఆవరణలో ఖౌమి ఏకతా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఈ వేదిక వద్ద ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. ఈ వేదిక గంగాజమున తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తుంది.

పండుగ ప్రాశస్త్యం..

ఇబ్రాహీం ఖలీలుల్లా రజియల్లాహు తాలా అనే పైగంబర్ (ప్రవక్త) దంపతులు చేపట్టిన నియమ నిష్టల ఫలితంగా వారికి ఇస్మాయిల్ జబీవుల్లా అనే ఏకైక కొడుకు జన్మిస్తాడు. అయితే వారి భక్తి, త్యాగాన్ని పరీక్షించడానికి అల్లా తన కొడుకును బలి ఇవ్వాల్సిందిగా ఇబ్రాహీం కలలో కనిపించి ఆజ్ఞాపిస్తాడు. దైవ నిర్ణయాన్ని శిరసావహించడమే మార్గదర్శకంగా భావించిన ఆ దంపతులు.. తమ కుమారుడిని బలి ఇవ్వడానికి నిర్ణయించి అంతా సిద్ధం చేస్తారు. దైవాదేశం మేరకు ఆ బాలుడిని సుదూర ప్రాంతమైన అడవుల్లోకి తీసుకెళ్లి బలి పీఠంపై పీక కోయడానికి తండ్రి సిద్ధమవుతుండగా.. ఆ ఖుర్బానీ ప్రక్రియను ఆపివేయాలని దైవవాణి వినిపిస్తుంది. దైవ వాక్కు వృథాగా పోకూడదని ఇస్మాయిల్ జబీవుల్లా స్థానంలో అటుగా వచ్చిన ఓ పొట్టేలును బలి ఇవ్వాలని ఆదేశిస్తుంది. మానవ కల్యాణం కోసమే ఈ సంఘటన జరిగిందని భావించి ముస్లింలు ఆ నాటి నుంచి బక్రీద్ పండుగ దినాల్లో ఖుర్బానీ ఇస్తారు.

జోరుగా పొట్టేళ్ల విక్రయాలు..

బక్రీద్ పండుగలో ఖుర్బానీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు పొట్టేళ్ల మాంసాన్ని పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో నాలుగు రోజుల నుంచే పొట్టేళ్ల విక్రయ కేంద్రాలు వెలిశాయి. పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో, న్యూటౌన్, వన్‌టౌన్, క్లాక్‌టవర్, మార్కెట్, మదీనా మసీదు, షాషాబ్‌గుట్ట, రాయిచూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖుర్బానీ మూడు రోజులు ఉండటంతో వేలాది పొట్టేళ్లను విక్రయానికి ఉంచారు. పొట్టేళ్ల బరువు మేరకు రూ. 10వేల నుంచి రూ. 24వేల వరకు అమ్ముతున్నారు. జత పొట్టేళ్ల ప్రకారం కూడా అమ్మకాలు చేస్తున్నారు.

ఇంట్రా డిస్ట్రిక్ట్ చాంపియన్ పాలమూరు


విజేత మహబూబ్‌నగర్ జట్టుతో ఎన్‌ఆర్‌ఐ కేడం శ్రీనివాస్, ఎండీసీఏ ప్రతినిధులు

- లీగ్‌లో ఐదు విజయాలు.. 15 పాయింట్లతో అగ్రస్థానం
- చివరి మ్యాచ్‌లో 71 పరుగుల తేడాతో జడ్చర్లపై గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: అండర్-19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ చాంపియన్‌గా మహబూబ్‌నగర్ జట్టు నిలిచింది. లీగ్‌లో మొదటి నుంచి మెరుగైన ప్రదర్శన కనబరిచిన మహబూబ్‌నగర్ జట్టు.. వరుసగా ఐదు మ్యాచుల్లో విజయాలు సాధించి 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌కై వసం చేసుకుంది. జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 71 పరుగుల తేడాతో జడ్చర్ల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 240 పరుగులు చేసింది. జట్టులో కనిష్క ఆలౌ రౌండ్ ప్రతిభ కనబరిచాడు. 84 బంతుల్లో 6 ఫోర్లతో 51 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో 2 వికెట్లు తీశాడు. ఇతర బ్యాట్స్‌మన్లు యువన్ ముద్దనూరి 43, మనోజ్‌యాదవ్ 39, ఎండీ సోను 38, అబ్దుల్ రాఫే 35 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జడ్చర్ల జట్టు 41.5 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో సంజయ్ 91 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 73 పరుగులు, కేతన్‌కుమార్ 35 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లు అంకిత్‌రాయ్ 10 ఓవర్లలో 34 పరుగులు ఇచ్చి 3, అభినవ్ 2, నవీన్‌కుమార్, ప్రణయ్, యువన్ చెరో వికెట్ తీశారు.

జిల్లా క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయిలో ఆడాలి..

జిల్లా క్రికెటర్లు ప్రతిభ కనబరుస్తూ భవిష్యత్‌లో రంజీ, భారత జట్టులో ఆడాలని ఎన్‌ఆర్‌ఐ, సీనియర్ క్రీడాకారుడు కేడం శ్రీనివాస్ అన్నారు. అండర్-19 ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టును ఆయన అభినందించి మాట్లాడారు. క్రీడాకారుల్లో క్రమశిక్షణ చాలా ముఖ్యమని.. క్రమశిక్షణ, పట్టుదలతో ఆడితే మెరుగైన విజయాలు సాధించవచ్చని అన్నారు. క్రికెట్‌లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించడానికి మొదటిసారిగా ఆరు జట్లతో అండర్-19 క్రికెట్ లీగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి లీగ్ మ్యాచ్‌లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ వ్యక్తిగత ప్రదర్శన చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, ఎండీ మన్నాన్, సీనియర్ క్రీడాకారుడు మహేష్ పాల్గొన్నారు.

పశువుల వాహనాల పట్టివేత

దేవరకద్ర రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను శుక్రవారం దేవరకద్ర పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల మేరకు.. దేవరకద్ర మీదుగా మహబూబ్‌నగర్‌కు రెండు వాహనాల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు చౌదర్‌పల్లి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో డీసీఎంలో 13 కోడెలు, బొలేరో వాహనంలో 4 కోడెలు, ఒక ఆవును అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహన డ్రైవర్లు హసన్, అహ్మద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. అనంతరం పశువులను చిన్న దర్పల్లిలోని గోశాలకు తరలించారు.

వైభవంగా రంగనాథస్వామి కల్యాణం


రంగనాథస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కందనూలు: జిల్లాకేంద్రం శివారులోని శ్రీపురంలో రంగనాథస్వామి కల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారి ఎదుర్కోళ్లు, పల్లకీసేవ, అనంతరం భక్తుల సమక్షంలో రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో శ్రీపురం మార్మోగింది. సాయంత్రం మాడవీధుల్లో రథోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, చైర్మన్ రామకృష్ణారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు


తీలేరు వద్ద నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

తీలేర్ దగ్గర పంపు ప్రారంభించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

దేవరకద్ర/ మరికల్: జూరాల ప్రాజెక్టుకు వరదలు రావడంతో కృష్ణాజలాలు కోయిల్‌సాగర్‌కు పరుగులు పెడుతున్నాయి. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం కింద ఉంద్యాల వద్ద ఉన్న ఫేస్-1 పంప్‌హౌస్ నుంచి ఈ నెల 1న ఒక పంపును రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఆ నీటితో ముందుగా పర్దీపూర్ రిజర్వాయర్‌ను నింపిన తర్వాత అక్కడి నుంచి తీలేర్‌కు తరలించారు. దీంతో తీలేర్ ఫేస్-2 వద్ద ఒక పంపును రన్ చేసి కోయిల్‌సాగర్‌కు నీటిని వదిలారు. ఈ మేరకు శుక్రవారం తీలేర్ పంపుహౌస్ వద్ద నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఒక మోటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూరాలకు ఎగువ నుంచి వరద రావడంతో ప్రస్తుతం ఒక పంపు ద్వారా రోజుకు 315 క్యూసెక్కుల నీరు కోయిల్‌సాగర్‌కు చేరుతుందన్నారు. జూరాలకు వరద నీరు అలగే కొనసాగితే మరికల్ మండలంలోని చెరువులను నింపేందుకు 150 క్యూసెక్కుల నీటిని లింకు కెనాల్‌కు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఒకసారి పూర్తిస్థాయిలో నిండితే రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంకోటి, ఆర్ఐ సుధాకార్‌రెడ్డి, నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, రఘు, హర్షవర్ధన్‌రెడ్డి, నరహరి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, చిన్నబాలు, హన్మంతు పాల్గొన్నారు.

■ కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 11 అడుగుల మేర నీటి మట్టం నిల్వ ఉండగా పాత అలుగు స్థాయి నీటిమట్టం 26.6 అడుగులు. కాగా గేట్ల స్థాయి వరకు 32.6 అడుగులు రావాల్సి ఉంటుంది. ఎత్తిపోతల పథకం నీటి విడుదల ఇలాగే కొనసాగితే ఈ నెలాఖరు వరకు పాత అలుగుకు నీటిమట్టం చేరే అవకాశం ఉంది.

పిచ్చికుక్క స్వైర విహారం

ఆరుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


గాయపడిన గోపాల్, గోపి

ఎర్రవల్లి: పిచ్చికుక్క దాడిలో ఆరుగురు గాయపడిన ఘటన మండలంలోని వల్లూరులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని వివిధ కాలనీలకు చెందిన గోపాల్, మద్దమ్మ, మాసుంబీ, గోపి, వెంకటేష్, వేణుగోపాల్‌ని కరిచింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మద్దమ్మ, వెంకటేష్ ఇంటికి చేరుకోగా.. మిగిలిన నలుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వారు వివరించారు. ఆరుగురిపై కుక్క దాడి చేసి గాయపర్చినట్లు తమకు సమాచారం వచ్చిందని.. బాధితులు ఇటిక్యాల ఆరోగ్య కేంద్రానికి రాలేదని మండల వైద్యాధికారి డా. రాధిక తెలిపారు. కేంద్రంలో రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని.. కుక్క కాటుకు గురైనవారు వచ్చి చికిత్స పొందవచ్చని సూచించారు.

వెల్దండలో ఒకరు..

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన జంగిలి పెద్ద ఆంద్రయ్య (72)పై గురువారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న వీరనాగమ్మ పండుగకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా 8 కుక్కలు దాడి చేయగా కింద పడిపోయాడని.. ముఖంపై గాయాలైనట్లు పేర్కొన్నారు. గుర్తించిన స్థానికులు వెంటనే కుక్కల గుంపును చెదరగొట్టి చికిత్స నిమిత్తం 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. గ్రామంలో వీధి కుక్కలు అధికం కావడంతో చిన్నారులు, వృద్ధులు బయట తిరిగేందుకు భయపడుతున్నారని గ్రామస్తులు వివరించారు.

నెమలి అప్పగింత


ఫారెస్ట్ అధికారికి నెమలిని అప్పగిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు

నర్వ: మండలంలోని జంగంరెడ్డిపల్లి శివారులో కుక్కల దాడికి గురైన నెమలిని స్థానికులు కాపాడి శుక్రవారం ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు వివరాల మేరకు.. జంగంరెడ్డిపల్లి శివారులోని పొలాల నుంచి నెమలిని కుక్కలు తరుముకుంటూ రాగా.. గమనించిన గ్రామవాసి బాలస్వామి కుక్కలను తరిమివేసి నెమలిని రక్షించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నెమలిని అప్పగించగా.. ఫారెస్టు అధికారి మల్లేశ్‌కు అందించారు. నెమలిని కాపాడిన బాలస్వామిని వారు అభినందించారు.